అనుదినం జనస్వరం

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి

1

గురువారం 25 మే 2023


**ఉష్ణోగ్రతలు**

| | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| నల్లగొండ | 42.0 | 23.2 |
| సూర్యాపేట | 43.5 | 34.2 |
| యాదాద్రిభువనగిరి | 44.0 | 31.9 |

## 26న హజ్ యాత్రికులకు రక్త పరీక్షలు

**నవతెలంగాణ-మిర్యాలగూడ**

పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్ళనున్న యాత్రికులకు ఈనెల 26 న మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ ఆస్పత్రిలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ డివిజన్ హజ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అర్షద్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన హజ్ యాత్రికులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డుతో హాజరై ఈసీజీతో పాటు రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

# సూర్యాపేట మెడికల్ కళాశాలకు 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ల మంజూరు

- మంత్రి జగదీశ్ రెడ్డి అభ్యర్థనకు సీఎం కేసీఆర్ సానుకూలనిర్ణయం
- సీఎం కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి

**నవతెలంగాణ-సూర్యాపేట**

సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల కు కొత్తగా 45 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేశారు. ఏక కాలంలో ఇంత మందిని నియమించడం ద్వార వైద్య రంగంలో నూతనాధ్యాయం సృష్టించినట్టయ్యింది. జనరల్ మెడిసిన్(5) జనరల్ సర్జన్(7) ఆర్థోపెడిక్(3) పిడియాట్రిక్(5)ఈ యన్ టి(1) ఓబి జీ,(8)అనస్థీషియా(7) అనాటమీ(1) పథాలజీ,(2)మైక్రో బయలజీ(1)ఫోరెన్సిక్ మెడిసిన్(1) రేడియో డయాగ్నిస్ (3) ఆప్తాల్ (1) కమ్యూనిటీ మెడిసిన్ (1) విభాగాలకు కలిపి మొత్తం 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. పేద ప్రజలకు వైద్య సేవల విస్తరణకు ఈ నియామకాలు దోహదపడతాయి.




**ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు -మంత్రి జగదీశ్ రెడ్డి**

ఏకకాలంలో సూర్యాపేట మెడికల్ కళాశాలకు 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల మంత్రి జగదీశ్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా సహచర వైద్య ఆరోగ్య , ఆర్థిక శాఖామంత్రి హరీష్ రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికారంలోకి వచ్చాక విద్య, వైద్య రంగంలో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులకు ఈ నియామకాలు అద్దం పడ్తుందనీ ఆయన పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాలకు వైద్య సేవల విస్తరణకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల ప్రక్రియ ఖచ్చితంగా దోహద పడుతుందని ఆయన పేర్కొన్నారు. పేదలకు ఆధునిక వైద్యం అందుబాటులోకి తేవడమే కాకుండా అందుకు అనుగుణంగా నియామకాలను చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ సామాన్యుడిపై ఉన్న ప్రేమ ను మరోమారు చాటుకున్నారని కొనియాడారు.



## గోపాల మిత్రులకు ఆఫీస్ సబ్ ఆర్డినెట్స్‌గా అవకాశం కల్పించాలి

- గోపాలమిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెరుకు శ్రీనివాస్



**నవతెలంగాణ- భువనగిరిరూరల్**

పశుసంవర్ధక శాఖలో గోపాల మిత్రులుగా విధులు నిర్వర్తిస్తూ మూగజీవాలకు సేవ చేస్తున్న వారికి ఆఫీస్ సబార్డినేట్స్‌గా అవకాశం కల్పించాలని గోపాల మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెరుకు శ్రీనివాస్ కోరారు. బుధవారం జిల్లాకేంద్రంలో గోపాలమిత్రల ముఖ్యుల సమావేశ నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో గోపాల మిత్రులు 1530 మంది విధులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేశానికి రైతు వెన్నెముక అయితే అదే రైతుకు పాడి పరిశ్రమ వెన్నెముక లాంటిదన్నారు. పశుసంవర్ధక శాఖకు 22 ఏండ్ల నుంచి24 గంటలు సర్వీస్ అందిస్తూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని లబ్దిదారులకు అందజేయడంలో కీలకపాత్ర వహిస్తున్నట్టు తెలిపారు. కాగా ఇటీవల సీఎం కేసీఆర్ గోపాల మిత్రుల వేతనం 8500 నుంచి 11050 రూపాయలకు పెంచారని వేతనం పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన వారందరికీ వెటర్నరీ అసిస్టెంట్ గా పరీక్షలలో 30 శాతం మార్కులు వెయిటింగ్ వెయిటేజ్ అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పూలేపాక రాములు, ప్రధాన కార్యదర్శి రేగు బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎల్లంల జంగయ్య యాదవ్ పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక చింతంతోనే మానసిక ప్రశాంతత

- శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్**

ఆధ్యాత్మిక చింతంతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామంలో రామాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవారాధన చేయటం సాంప్రదాయంగా అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మెన్ నల్లమోతు సిద్ధార్థ, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మట్టపల్లి సైదులు యాదవ్, పీసీకే. ప్రసాద్, ఆదిరెడ్డి, శ్రీనివాస, లక్ష్మయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**నవతెలంగాణ-నిడమనూరు**

మండలంలోని ఇండ్ల కోటయ్యగూడెం గ్రామంలోని మత్స్య అభివృద్ధిశాఖ కార్యాలయం ఆధీనంలో ఉన్న చెరువు నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్ తెలిపారు. బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చెరువును సందర్శించి పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. సుమారు 60 ఎకరాల చెరువు శిఖం భూమి నుండి గత పది రోజులుగా ప్రయివేటు వ్యక్తులు యథేచ్ఛగా చెరువు మట్టిని తరలించకపోతున్నారని, ఇటుకల బట్టిలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. పది రోజులుగా తవ్వకాలు అక్రమంగా జరుపుతూ ఇప్పటి వరకు సుమారు 6 వేల ట్రిప్పుల మట్టిని తరలించిపోయారని తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు అక్రమంగా జరుగుతున్న మత్స్యశాఖ అధికారులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ, మైనింగ్ అధికారులు గానీ చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని, మత్స్యశాఖ అధికారులు రెవెన్యూ అధికారుల అండతోనే అక్రమ దందా కొనసాగుతుందన్న ఆరోపించారు. ప్రభుత్వ చెరువు నుండి మట్టి అక్రమ రవాణాకు పాల్పడి సొమ్ము చేసుకుంటున్న వారిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలంలో ముప్పారం రాజన్న గూడెం వెనిగండ్ల, ముకుందాపురం గ్రామాలలో యేనెలు, గుట్టల నుండి నిత్యం మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, ప్రయివేటు వ్యక్తులు సొమ్ము చేసుకుంటున్న ప్రభుత్వాధికారులు రెవెన్యూ, మైనింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారని అక్రమ తవ్వకాలను అరికట్టి, ప్రభుత్వ ఆస్తులను కాపాడి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట మండల కమిటీ సభ్యులు మలికంటి చంద్రశేఖర్, పరిపూర్ణ చారి తదితరులు ఉన్నారు.



## వీఓఏల సమస్యలను పరిష్కరించాలి

- దీక్షా శిబిరంలో అస్వస్థతకు గురైన వీఓఏ

**నవతెలంగాణ-నాంపల్లి**

వీఓఏలు తమ సమస్యల పరిష్కారానికి చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారానికి 38వ రోజుకు చేరింది. నాంపల్లి మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ముందు వీవోఏలు సమ్మె చేస్తున్న దీక్ష శిబిరం వద్ద ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ మండుటెండలను సైతం లెక్కచేయకుండా మొక్కవోని దీక్ష చేస్తున్న వీవోఏల న్యాయమైన డిమాండ్లను, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్ని కష్టాలు నష్టాలు వచ్చినా మా వేతనాలు పెరిగే వరకు ఈ సమ్మె విరమింప చేసేది లేదని వీవోఏలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వీవోఏల సంఘం మండల కార్యదర్శి ఎస్‌కే. ఫర్హానా వడదెబ్బతో దీక్ష శిబిరం వద్ద స్వల్ప అస్వస్థతకు గురి కావడంతో తోటి వీవోఏలు ఆమెను వెంటనే స్థానిక ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పి వైద్యం చేయించారు. ఈ కార్యక్రమంలో వీవోఏ ల సంఘం మండల అధ్యక్షురాలు ఎస్.కె సైదాబేగం, నాంపల్లి రోజారాణి, ,భిక్షపంమ్మ, వసుమతి, భవాని, దీప, తదితరులు పాల్గొన్నారు.



# అన్యాక్రాంతమైన మున్సిపల్ భూమిపై సమగ్ర విచారణ జరపాలి

- బాధ్యుల పైన చర్యలు తీసుకోవాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్

**నవతెలంగాణ -భూదాన్‌పోచంపల్లి**

అన్యకాంతానికి గురైన భూమిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో అన్యాక్రాంతమైన భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో శ్రీమిత్ర వెంచర్ ఉన్నటువంటి శ్రీ మిత్ర టౌన్‌షిప్‌లక్ష గతంలో గ్రామపంచాయతీకి 10 శాతం భూమిని కేటాయించారన్నారు. ఆ భూమి మున్సిపల్ ఏర్పాటు అయిన తర్వాత మున్సిపల్ పరిధిలోకి వచ్చిందన్నారు. ఆ భూమిని పోచంపల్లి మున్సిపల్ పాలకవర్గం అధికారాన్ని అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు అమ్ముకొని కోట్ల రూపాయలు దండుకున్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి భూమిని స్వాధీనం పరుచుకొని అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దుచేయాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇ ఆరోపణలు రోజు వస్తున్నా ఇంతవరకు జిల్లా స్థాయి అధికారులు స్పందించలేదన్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే భూములను మాయం చేస్తుంటే సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ లను రద్దుచేసి వెంటనే భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోనట్లయితే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ మాట్లాడుతూ భూదాన ఉద్యమానికి నాంది పలికి నేడు ప్రపంచ చేనేత వస్త్రాలకు మంచి గుర్తింపు లభించిన పోచంపల్లి ఇంటర్మీడియట్ కాలేజీకి స్థలం లేక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల దేశాల పర్యాటకులకు పార్కు గాని స్థలం లేక అవస్థలు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. .మున్సిపాలిటీకి సంబంధించిన భూములను అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు కోట్లురూపాయలు దండుకున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి భూమి ఆక్రమణ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్, మండల నాయకులు రాంచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధు, బుగ్గ లక్ష్మయ్య పాల్గొన్నారు .

# మోటకొండూరు రోడ్డుకు మహర్దశ

- వంగపల్లి - మోటకొండూర్ వరకు డబుల్ రోడ్డు
- ఆర్ అండ్‌బీ కింద రూ. 18.70 కోట్ల నిధులు
- రూ. 5.30 కోట్లతో సీసీ బడెడ్ డివైడర్, సెంట్రల్ లైటింగ్
- ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి

**నవతెలంగాణ- మోటకొండూర్**

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో నూతనంగా ఏర్పాటైన మోటకొండూర్ రోడ్డుకు మహర్దశ రానున్నట్టు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి తెలిపారు. వంగపల్లి జాతీయ రహదారి నుంచి ఖప్రాయిపల్లి 35 కిలోమీటర్ల వరకు రెండు వరుసల రహదారి నిర్మించేందుకు ఆర్‌అండ్‌బీ కింద రూ. 18.70 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు, త్వరలో సీఎం కేసీఆర్ ఆమోద ముద్ర వేయనున్నట్టు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రెండు విడతలుగా డబుల్ రోడ్డు నిర్మిస్తామన్నారు. మొదటగా వంగపల్లి నుంచి మోటకొండూర్ మండల కేంద్రం వరకు పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఇందులో ప్రత్యేకంగా రూ. 5.65 కోట్లతో మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి వర్టూర్ రోడ్డు లోని రాయకుంటపల్లి జంక్షన్ వరకు సీసీ బడెడ్ రోడ్డు తోపాటు డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మిస్తామని చెప్పారు. ఇందుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశామన్నారు. గతంలో రోడ్డు పంచాయతీ రోడ్డుగా ఉండేదన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు ఆర్ అండ్ బీ కు మార్చమని తెలిపారు. 2013 లో వంగపల్లి అప్పట్లో లారీ లతో ఇసుక దందాలు సాగేవని, దీంతో రోడ్లు అధ్వానంగా మారాయని తెలిపారు. 2015లో అప్పట్లోనే బీటీ రోడ్డును పునరుద్ధరించమని తెలిపారు. తాజాగా మరోసారి యుద్ధ ప్రాతిపదికన వంగపల్లి నుంచి ఖప్రాయపల్లివరకు 35 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డును రూ. 5.52 కోట్లతో పునరుద్ధరణ చేపట్టున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే 25 కిలోమీటర్ల వరకు పనులు పూర్తయ్యాయని, మరో 10. కిమీ పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. నూతనంగా ఏర్పాటైన మోటకొండూర్ లో అభివృద్ధి కి నాది హామీ అన్నారు. కరోనా ప్రభావంతో నిధుల మంజూరుకు జాప్యం జరిగింది వాస్తవమని చెప్పారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్‌కు నిధులు మంజూరయ్యారని తెలిపారు. రాబోయే రోజుల్లో శాశ్వత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మండల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పల్లా వెంకట్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పైళ్ల సత్యనారాయణ రెడ్డి, నర్సింగ్ యాదవ్ బురాన్ తదితరులు పాల్గొన్నారు.



## వ్యక్తి ఆత్మహత్య

**నవతెలంగాణ-మిర్యాలగూడ**

పట్టణంలోని రవీందర్ నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో బుధవారం ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు విచారించిన టూ టౌన్ పోలీసులు మృతుడు గుర్రంపోడు మండలం బుడ్డారెడ్డి గూడానికి చెందిన కన్నబోయిన సైదులుగా గుర్తించారు. కుటుంబ కలహాలు కారణంగా సైదులు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తూ కేసు దర్యాప్తు చేస్తున్నారు.




## పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

**నవతెలంగాణ-సూర్యాపేట**

పట్టణంలోని ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించి డ్రెయినేజీలలోని చెత్త, వ్యర్థ పదార్థలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. బుధవారం స్థానిక 45 వ వార్డు విద్యానగర్ నందు నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం లో వార్డు కౌన్సిలర్ గండూరి పావని క్రపాకర్ తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రతి వార్డులో వర్షాకాలానికి ముందే డ్రెయినేజీ ల పూడికతీత పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా వుంచాలని, డ్రెయినేజీ కాలువలలో వ్యర్థాలను వేయడం వలన దోమలు చేరి రోగాల బారిన పడవలసి వస్తుందని, కాబట్టి ఇంట్లోని తడి చెత్తను మున్సిపాలిటీ ట్రాక్టరు కు ఇవ్వాలని అన్నారు. పొడిచెత్త అనగా పాత పుస్తకాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు మున్సిపాలిటీ ఆర్.ఆర్.ఆర్ కేంద్రంలో విక్రయించి కిలో కు 5/- నగదు పొందాలని అన్నారు. 45 వ వార్డులో వేసవి సెలవులలో 100 మంది విద్యార్థులకు చెస్ ఆటలో శిక్షణ ఇస్తున్న బిఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు గండూరి క్రపాకర్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామాంజుల రెడ్డి, బిఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు గండూరి క్రపాకర్, నూకల వెంకట రెడ్డి, మీలా వంశి, వైద్యులు డాక్టర్ తోట కిరణ్, డాక్టర్ దేవరశెట్టి దినేష్, ప్రభాకరాచారి, మున్సిపాలిటీ ఎస్ ఐ శ్రీనివాస్, జవాను కొండేటి వెంకన్న, కుక్కడపు సాలయ్య, భిక్షం, ఇస్మాయిల్, కళ్యాణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ

గురువారం 25 మే 2023




## ఆర్థిక సాయం

నవతెలంగాణ-నల్లగొండరూరల్

కనగల్ మండలం దర్వేషిపురం గ్రామానికి చెందిన గట్టిగుండ్ల గోపాల్ అనారోగ్యంతో మరణించారు. బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్ దశదిన కార్యక్రమానికి హాజరై నివాళులర్పించి కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జినుకుంట్ల రాములుగౌడ్, జినుకుంట్ల జయశంకర్‌గౌడ్, మాధ నర్సింహగౌడ్, జినుకుంట్ల శ్రీనివాస్‌గౌడ్, జినుకుంట్ల నగేష్‌గౌడ్, చిలకరాజు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీసీ యువజన నియోజకవర్గ ఇన్‌చార్జిగా విజయ్

నవతెలంగాణ-దేవరకొండ

బీసీ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా దేవరకొండ పట్టణానికి చెందిన కామోజీ విజయ్‌ను నియమించినట్టు బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సరికొండ జనార్దన్ రాజు తెలిపారు. బుధవారం నియామక ఉత్తర్వులు విజయ్‌కు సంఘం సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన విజయ్ మాట్లాడుతూ బీసీల ఐక్యతకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నేతల వెంకటేష్‌యాదవ్, భాస్కరచారి, ఎస్ఎన్.చారి, కానుగుల మధు, పెరికేటి భాస్కర్, లింగపల్లి యాదయ్య, గోపిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీయూలో నాక్ బృందం

- 19 విభాగాలో పరిశీలన
- విశ్వవిద్యాలయ గ్రేడును అంచనా వేసేందుకు కసరత్తు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..





నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం గత ఐదు విద్యా సంవత్సరాల కార్యకలాపాలను అంచనా వేసి, విశ్వవిద్యాలయ అభివృద్ధి ఆధారంగా గ్రేడును ప్రకటించేందుకు నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) బృందం సభ్యులు రెండవ విడత అంచనా కార్యక్రమాన్ని బుధవారం అట్టహాసంగా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ ప్రక్రియకు డాక్టర్ కృష్ణన్ భాస్కర్ అధ్యక్షులుగా, సభ్యులు డాక్టర్ అమితా రాణి కోఆర్డినేటర్, డాక్టర్ కేబీ. చంద్రిక, డాక్టర్ కుర్షిద అహ్మద్ బట్, డాక్టర్ నవదీప్ గోయల్ బృందం పరిశీలించనున్నారు. ముందుగా సభ్యులకు ఎన్సీసీ క్యాడెట్లు గన్ సెల్యూట్‌తో స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ సాంప్రదాయక కోలాటంతో ఆహ్వానం పలికారు. అనంతరం సభ్యులు మహాత్మా గాంధీకి నివాళు లర్పించారు. మొదటిరోజు ప్రారంభ కార్యక్రమంగా ఉపకులపతి ఆచార్య గోపాల్‌రెడ్డి ఐదు విద్యా సంవత్సరాల అభివృద్ధి, విద్యా కార్యకలాపాలను పవర్ పాయింట్ ద్వారా సభ్యులకు వివరించారు.

### 19 విభాగాలో పరిశీలన

నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ నాక్ బృందం సభ్యులు రెండు బృందాలుగా ఏర్పడి 19 శాఖలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### విశ్వవిద్యాలయ గ్రేడును అంచనా వేసేందుకు కసరత్తు

గత ఐదు విద్యా సంవత్సరాల్లో శాఖ నిర్వహించిన కార్యక్రమాలు, ప్రత్యేకతలు, పరిశోధనలు, అవార్డులు, ఆయా శాఖల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఇంజనీరింగ్ కళాశాల, సైన్స్ కళాశాల, ప్రయోగశాలలు, పరిశోధనలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎగ్జామినేషన్ బ్రాంచ్, ఆడిట్ సెల్‌ను పరిశీలించారు. తదనంతరం అధ్యాపకులు బోధ నేతర సిబ్బందితో విశ్వవిద్యాలయ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

### అలరించిన సంస్కృతి కార్యక్రమాలు..

అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ఆచార్య ఆర్.లింబాద్రి, రిజిస్టర్ ఆచార్య తుమ్మా కృష్ణారావు, పాలకమండలి సభ్యులు, ఓఎస్‌డీ ఆచార్య అల్వాల రవి, డాక్టర్ కవిత, శ్రీదేవి, ఐక్యూ ఏసి చైర్మెన్ డాక్టర్ ఆకుల రవి, డాక్టర్ అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి

- నకిలీ విత్తనాల నివారణపై ప్రత్యేక నిఘా
- ఎస్పీ కే.అపూర్వరావు



నవతెలంగాణ-నల్లగొండ

గత నెలలో జరిగిన నేరాలపై చర్చించి పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని, దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. ఇందుకోసం కోర్టులలో న్యాయమూర్తులతో చర్చించి కేసుల పురోగతి, విచారణ విషయాలలో అధికారులంతా చురుకుగా పని చేయాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా రాత్రి పూట గస్తీ బీట్‌లు, పెట్రోలింగ్ నిర్వహించాలని 100 కాల్ కి వెంటనే స్పందించి ఆపదలో ఉన్న వారికి తక్షణ సహాయం అందజేయలన్నారు. వానాకాలం సీజన్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా, నకిలీ విత్తనాలు నివారణ పైన నిఘా పెడుతూ రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా జరిగి రైతులు నష్టపోక ముందే అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను సిబ్బందిని అభినందించారు. ప్రతిభ కనబరిచే సిబ్బందిని అధికారులను గుర్తించి ప్రతి నెల అధికారులను సిబ్బందిని ప్రోత్సహించే విధంగా రివార్డులు, అవార్డులు, ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లాలో పలు విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కేఆర్‌కే.ప్రసాదరావు, డీఎస్పీలు నరసింహరెడ్డి, వెంకటగిరి, నాగేశ్వరరావు, రమేష్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఫార్మా కంపెనీ నిర్మాణాన్ని తక్షణమే ఆపాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం



నవతెలంగాణ-చండూరు

గట్టుప్పల మండలంలో ఫార్మా కంపెని నిర్మాణాన్ని తక్షణమే ఆపుదల చేయాలని సీపీఐ(ఎం) గట్టుపల మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం అన్నారు. బుధవారం గట్టుప్పల మండల కేంద్రంలో గట్టుపల టౌన్ శాఖ సమావేశం ఎండీ.రబ్బాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ వలన కాలుష్యం బారినపడి ప్రజలు అనారోగ్య పాలవుతారన్నారు. ఇక్కడ సాగు భూములకు ఈ కాలుష్యం వల్ల తీవ్ర నష్టం ఏర్పడుతుందని, ఈ ఫార్మా కంపెనీతో ఈ ప్రాంతానికి గాని, రాష్ట్రాన్ని గాని ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రజల బాగోగులను పర్యావరణాన్ని పరిరక్షించడానికి తక్షణమే గట్టుప్పల్‌లో ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీని తక్షణమే మూసివేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాకు బదులు, ఇతర చేతివృత్తుల కంపెనీలను ఏర్పాటు చేసి ఉద్యోగ వసతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) టౌన్ శాఖ కార్యదర్శి కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేష్, పెద్దగాని నరసింహ, పసుపుల చెన్నయ్య, తిరందాసు బిక్షమయ్య, మొద్దు గాలయ్య, నల్లవెల్లి బిక్షం, వడ్డేపల్లి లక్ష్మయ్య, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముసా అలీ ఖాన్‌కి ఎన్టీఆర్ పురస్కారం



నవతెలంగాణ-మిర్యాలగూడ

పట్టణానికి చెందిన కళాకారుడు ముసా అలీఖాన్ ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందుకున్నట్లు బుధవారం తెలిపారు. ఎన్టీఆర్ శతజయంతి వేడుకలో భాగంగా ఈ నెల 23న శిఖరం ఆర్ట్ థియేటర్స్ వారు కీర్తి పురస్కారాలను అందచేసినట్లు పేర్కొన్నారు. త్యాగరాయ గాన సభ వేదిక వద్ద పలువురు సినీ ప్రముఖులతో పాటు ముసా అలీఖాన్‌ని ప్రత్యేక అతిధిగా ఆహ్వానించి పురస్కారం అందించినట్లు తెలిపారు. సినిమా రంగంతో పాటు రాజకీయ రంగంలో విశేష గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. మాజీ స్పీకర్ మధుసూదనా చారి, సినీ రంగ ప్రముఖులు శ్రావణి, అనుషా, మాగంటి ప్రసాద్‌బాబు, పద్మారెడ్డి తదితరుల సమక్షంలో అవార్డు బహుకరించిన కృష్ణ గోళ్ళకి కృతజ్ఞతలు తెలిపారు.

## కండ్లకు గంతలు కట్టుకొని నిరసన



నవతెలంగాణ-నల్లగొండ

తిరుమలగిరిలో అఖిలపక్షం మహా ధర్నాకు పోలీసుల అనుమతి నిరాకరణకు నిరసనగా బుధవారం నల్లగొండలో అంబేద్కర్ విగ్రహం వద్ద వైయస్సార్ టీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పర్వతం వేణు ఆధ్వర్యంలో కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్న బీఆర్ఎస్ పార్టీకి రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అఖిలపక్షం తలపెట్టిన ధర్నాను అనుమతి నిరాకరించడం నీతిమాలిన చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయ షర్మిల చేస్తున్న పోరాటాన్ని ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి శ్రీనివాస్, కొరివి విజయ్ ముదిరాజ్, శివ, కట్టా రజనీకాంత్, మంగినపల్లి కృష్ణ పాల్గొన్నారు.


## నకిలీ విత్తనాలను అరికట్టాలి : ఏఓ సందీప్



నవతెలంగాణ-పెద్దవూర

నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి సందీప్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎస్ఐ పరమేషతో పాటు విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నకిలీ విత్తన రహిత మండలంగా చేయాలని సూచించారు. వానాకాలం సీజనను దృష్టిలో పెట్టుకుని నకిలీ విత్తన విక్రయాలు, రవాణా జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుటుంన్నామని చెప్పారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకుండా రైతులకు అవగాహన కల్పిస్తూ వ్యవసాయ, పోలీసశాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ, పోలీస్ సిబ్బంది, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-మిర్యాలగూడ

లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ముత్తిరెడ్డి కుంటకు చెందిన మాదాసు జయరాజు (45) పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పట్టణంలోని శాంతినగర్‌లో జరిగిన ఒక శుభకార్యానికి హాజరై ఇంటికి తిరిగి వెళుతూ నడుక్కుంటూ రోడ్డు దాటుతుండగా అద్దంకి నుండి నార్కెట్పల్లికి వెళ్లే లారీ డ్రైవర్ జాగ్రత్తగా వాహనాన్ని నడిపి జయరాజును ఢీకొట్టాడు దీంతో జయరాజుకు తలకు తీవ్రగాలై అక్కడికక్కడ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య విజయశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## లారీల కొరత లేకుండా ధాన్యాన్ని తరలించాలి



నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న 30శాతం యాసంగి ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి లారీల కొరత లేకుండా తరలించాలని టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దైద రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాలలో కొనుగోలు చేయకుండా సుమారు 30శాతం దాన్యం మిగిలి ఉందన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల బాధలను అర్థం చేసుకొని అధికారులు ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి తరలించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుల వద్ద దిగుమతి చేయడంలో నిర్లక్ష్యం వల్ల లారీల కొరత ఏర్పడుతుందన్నారు. దిగుమతి సమస్యపై స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని మిల్లుల యజమాలతో మాట్లాడి త్వరితగతిన దిగుమత అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య

నవతెలంగాణ-మర్రిగూడ


వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 38 రోజులో భాగంగా వీఓఏలు మర్రిగూడ మండల చౌరస్తా నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వీవోఏల సమస్యల పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమ్మెకు సంఘీభావం తెలుపుతూ ఆయన మాట్లాడారు. ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీఓఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రంగినేని చంద్రకళ, పానుగంటి పద్మ, వ్యాస మానస, మలిగిరెడ్డి, శోభ, డప్పు, జ్యోతి, సుమలత, కరుణ కదారి యాదమ్మ, బుగ్గ రాములు, నక్క సిరియాల, తదితరులు పాల్గొన్నారు.



## మహాప్రస్థాన వాహనం ప్రారంభం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల పురపాలిక సంఘానికి మహాప్రస్థాన వాహనం మంజూరైంది. పురపాలిక సంఘం కార్యాలయం ముందు నిలిపిన ఈ వాహనాన్ని మున్సిపల్ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్‌రెడ్డి బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆది మల్లయ్య, మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, వైస్ చైర్మెన్ కూరెల్ల లింగస్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ చిట్యాల పురపాలిక కేంద్రంలో దశల వారీగా ఎమ్మెల్యే చిరుమర్తి సహకారంతో ప్రజలకు సౌకర్యాల కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నూతన మునిసిపాలిటీ ఏర్పడిన నాటి నుండి పాలకవర్గం స్వర్గపురి వాహనం మంజూరి కోసం తీర్మానాలు చేసి పంపగా నూతన వాహనం మంజూరైందని తెలిపారు. దీంతో పట్టణ ప్రజలు ఇప్పటివరకు అంత్యక్రియలు జరిపేందుకు ప్రయివేటు వాహనాలపై ఆధారపడవలసి వచ్చేది. ఈ వాహనం రాకతో అంతిమ యాత్రకు కష్టాలు తీరనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, జడల పూలమ్మ చిన్న మల్లయ్య, పందిరి గీతా రమేష్, జిట్ట పద్మ బొందయ్య, కోనేటి కృష్ణ, సిలివేరు శేఖర్, టిఆర్ఎస్ నాయకులు పొన్నం లక్ష్మయ్య ,జిగిని బిక్షం రెడ్డి, బొర్రా రెడ్డి, కోనేటి ఎల్లయ్య, చిత్రగంటి ప్రవీణ్ దాసరి నరసింహ దితరులు పాల్గొన్నారు.




## ఎన్ఎస్పీ కెనాల్ పనులను పూర్తి చేయాలి

నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్

ఎన్ఎస్పీ కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండల పరిధిలో ములకల కాలువ మేజర్ ఎన్ఎస్పి కెనాల్ పనులు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆయన పరిశీలించి మాట్లాడారు. పనులు ప్రారంభించి దాదాపు పది 15 రోజులు దాటినా పనులు నత్తనడకగా నడుస్తున్నాయన్నారు. గుత్తేదారు ఎన్ఎస్పి కెనాల్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేయాలన్నారు. ఈ పనులను ఎన్ఎస్పీ అధికారులు పరిశీలన చేసి పనులు త్వరగా పూర్తిగా అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జానపాటి శ్రీను, జానపాటి సతీష్, ఎర్రబోయిన చిన్నరాజు, లింగయ్య, వెంకన్న, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జిగా దేవిక



నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ పట్టణానికి చెందిన దేవికను నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా ఇన్‌చార్జిగా నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ మహిళా కమిటీ అధ్యక్షురాలు గోపగాని మాధవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి దేవికకు నియామక పత్రాన్ని అందజేసి నియోజకవర్గంలో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా దేవిక విలేకరులతో మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దైద రవీందర్, కౌన్సిలర్ గాజుల సుకన్యకు కృతజ్ఞతలు తెలిపారు.

## నల్లగొండకు విస్తరించనున్న ఐటీ పరిశ్రమ

- త్వరలో నల్గొండలో ప్రారంభం కానున్న ఐటీ టవర్‌లో కార్యకలాపాలు
- ప్రారంభించేందుకు ముందుకు వచ్చిన సొనాటా సాఫ్ట్‌వేర్






నవతెలంగాణ-నల్లగొండ

నల్లగొండ పట్టణానికి ఐటీ పరిశ్రమ రానున్నది. నల్లగొండలో త్వరలో ప్రారంభం కానున్న ఐటి టవర్‌లో తన కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ సొనాటా ముందుకు వచ్చింది. ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటి పరిశ్రమను విస్తరించాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా నల్లగొండ ఐటీ టవర్‌లో సుమారు 200 ఉద్యోగాలను సొనాటా కల్పించనున్నది. సొనాటా సాఫ్ట్వేర్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు శ్రీని వీరవెల్లి మంత్రి కేటీఆర్‌తో అమెరికాలోని బోస్టన్ నగరంలో సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సెక్టార్, ఆరోగ్య రంగము, లైఫ్ సైన్సెస్ రంగాల్లో సేవలందించేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్, టెక్నాలజీ ఇన్నోవేషన్ల కోసం సొనాటా కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించనున్న కంపెనీ స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ, ముఖ్యంగా టెక్నాలజీ రంగంలో కల్పించనుంది. మంత్రి కేటీఆర్‌తో జరిగిన సమావేశంలో తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పెట్టుబడుల ప్రత్యేక కార్యదర్శి, విష్ణువర్ధన్‌రెడ్డి, చీఫ్ రిలేషన్స్ ఆఫీసర్ అమర్నాథ్‌రెడ్డి ఉన్నారు.

## కేసీఆర్‌తోనే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి



నవతెలంగాణ-కొండమల్లేపల్లి

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్‌తోనే ప్రభుత్వ పాఠశాలలన్నీ అభివృద్ధి చెందుతున్నాయని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ నాయక్ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణం కోసం, మౌలిక వసతుల కల్పన కోసం ఒక కోటి 95 లక్షల పైచిలుకు రూపాయలతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను బోధించి పరీక్ష ఫలితాలలో అధిక మార్కులు సాధించదశగా బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.దసురునాయక్, ఎంపీటీసీ చిన్నగొని శివగౌడ్, ఉపసర్పంచ్ గంధం సురేష్, వార్డు సభ్యులు ఎలిమినేటీ సాయి, కొడిదల వెంకటయ్య, వీ. శ్రీను మంగయ్య నాయక్, లాలు నాయక్, ఎంపీడీవో బాలరాజురెడ్డి, ఎంఈఓ మాత్యనాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంద సత్యనారాయణ, ఈవో వీరబాబు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దేశ సంపదను సంపన్న వర్గాలకు దోచిపెడుతున్న మోడీ

- జూన్ 4న కొత్తగూడెంలో జరిగే సీపీఐ ప్రజా గర్జనకు తరలిరావాలి
- సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి




నవతెలంగాణ-నల్లగొండ

కేంద్రంలో మోడీ ప్రభుత్వం దేశ సంపదను సంపన్న వర్గాలకు దోచిపెడుతు సామాన్య ప్రజలపై ధరల భారం మోపుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి పల్లా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజలను మభ్య పెట్టేందుకు గతంలో పెద్ద నోట్లను రద్దు చేసిందని... ఇప్పుడు మోసం చేయడం కోసం 2000 నోట్లను రద్దు చేసిందని విమర్శించారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభ కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజా గర్జనకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక దిగుబడి సాగుతున్న వరి కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులకు కొనుగోలు చేసిన డబ్బులను వెంటనే బ్యాంకులలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయం లేకుండా ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని రాబోయే రోజుల్లో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. అనంతరం సిపిఐ ప్రజాగర్జన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శిలు పల్లా దేవేందర్‌రెడ్డి, లోడింగ్ శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు తీర్పరి వెంకటేశ్వర్లు, పబ్బు వీరస్వామి, బంటు వెంకటేశ్వర్లు, ఆర్.అంజయ్య చారి, గిరి, రమ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లయ్యను పరామర్శించిన లింగంగౌడ్



నవతెలంగాణ-మర్రిగూడ

మర్రిగూడ మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన పగిళ్ళ ఎల్లయ్య గత కొద్ది రోజుల క్రితం ప్రమాదానికి గురై కాలు విరిగి విశ్రాంతి తీసుకుంటున్నారు. బుధవారం విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, శివన్నగూడ గ్రామ మాజీ సర్పంచ్ చెరుకు లింగంగౌడ్ ఎల్లయ్యను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సూర్యాపేట
గురువారం 25 మే 2023




## ఆర్థిక సాయం

నవతెలంగాణ-నాంపల్లి



మండలంలోని మెల్లావాయి గ్రామానికి చెందిన వేముల వెంకన్న కూతురు వేముల గాయత్రి ఇటీవల మరణించారు. బుధవారం నాంపల్లి మండల ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతా రవీందర్‌రెడ్డి వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. వీరితోపాటు మెల్లావాయి ఎంపీటీసీ బత్తుల వంశీ యాదవ్, కొన్‌రెడ్డి ఏడుకొండలు ఉన్నారు.

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ -అర్వపల్లి



ముఖ్యమంత్రి పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తామన్న సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.నవీన్ రెడ్డి మండల అధ్యక్షులు నెహ్రూ నాయక్ ప్రధాన కార్యదర్శి ఎన్.రాజశేఖర్ రెడ్డి కోశాధికారి ఎన్. మూర్తి మండల కార్యదర్శులు కావ్య,జ్యోతి, ఫర్హానా తదితరులు పాల్గొన్నారు .

# ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది

- ఎలక్ట్రిక్ వాహనాలకు ఉజ్వల భవిష్యత్తు
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి

నవ తెలంగాణ-సూర్యాపేట



పెట్రోలియం ఉత్పత్తులు లభ్యం కావడం కష్టం గాను, అధిక ధరలు వుండడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచ దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య ఒప్పందాలలో భాగంగా మన దేశంలో కూడా ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.బుధవారం స్థానిక రాయని గూడెం సమీపంలో ప్రముఖ వ్యాపారులు చల్లా బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వోల్టాన్ ఎలక్ట్రిక్ చార్జింగ్ హబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం గాలి, నీరు, సూర్యరశ్మి నుండి గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. సిఎం కెసిఆర్, ఐటి పరిశ్రమల మంత్రి కెటిఆర్ ల క్రిషి తో తెలంగాణ రాష్ట్రములో నూతన పారిశ్రామిక విధానంలో పారిశ్రామిక వేత్తలకు సులభంగా అనుమతులు లభిస్తున్నాయని అన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీలు హైదరాబాదులో తమ సంస్థలను నెలకొల్పుతున్నాయని, తద్వారా రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ చార్జింగ్ ఏర్పాటు చేయడంతో సూర్యాపేట పట్టణంలో పాత ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చడం జరుగుతుందని మంత్రి అన్నారు. సూర్యాపేటలో ఎవరైనా పరిశ్రమలు, వ్యాపారాలు పెట్టవచ్చని, వారికి తమ ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, జెడ్ పి వైస్ చైర్మన్ గోపగాని వెంకట నారాయణ, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ ఎస్ నాయకులు గండూరి ప్రకాష్, బైరు వెంకన్న, జ్యోతి కరుణాకర్, ఉప్పల ఆనంద్, తోట శ్యామ్ ప్రసాద్, చల్లా లక్ష్మి కాంత్, చల్లా లక్ష్మి ప్రసాద్, బండారు రాజా, వోల్టాన్ కంపెనీ ప్రతినిధులు రవిశంకర్, రాజా, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి కార్యకర్తకూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

- మాజీమంత్రి,పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

పార్టీ కోసం ప్రాణం పెట్టే కార్యకర్త ప్రమాదవశాత్తు ప్రాణం వదిలితే తన కుటుంబానికి రూ. 2 లక్షల బీమా కలిపిస్తూ అండగా ఉంటామని మాజీమంత్రి ,పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. సీతారాంపురానికి చెందిన చింతల హనుమంతరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం ద్వారా రాజీవ్ ప్రమాద బీమా క్రింద రెండు లక్షల చెక్కు ను బుధవారం హైదరాబాద్ లోని తన నివాసంలో వారి కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కు పునాది కార్యకర్త అని పార్టీ జెండాను, ఎజెండాను భుజాలపై మోస్తూ, జనం గుండెల్లో నిలిపేవాడు కార్యకర్త అని కొనియాడారు. అలాంటి కార్యకర్తకు కష్టం వస్తే కన్నతల్లి లాంటి పార్టీ ఆదుకోవాలన్న ఉద్దేశంతో ప్రమాద భీమా పథకాన్ని ప్రవేశ పెట్టిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి కుందామల్ల శేఖర్, వార్డు కాంగ్రెస్ ఇంచార్జి కుందామల్ల అంజమ్మ, ప్రమీల, మణెమ్మ, పార్వతమ్మ, మరియమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

# కొత్త మండలానికి తప్పని తిప్పలు

- అద్దె భవనంలో నడుస్తున్న వ్యవసాయ కార్యాలయానికి ఆరు లక్షల బకాయిలు
- తాగునీరు, విద్యుత్ కోతలను అధిగమించాలని కోరిన ఎంపీపీ
- పాలకీడు మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చ

నవతెలంగాణ-పాలకీడు



మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఆసజనకంగా నడిచింది. ప్రజా ప్రతినిధులు అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో పాటు, సమాధానాలు రాబట్టారు. మండలంలో గిరిజన రైతాంగం నుండి పోడు భూములకు 2,506 అప్లికేషన్స్ వచ్చాయని, 7000 ఎకరాల భూమిని గుర్తించామని, ప్రభుత్వ నిర్ణయం మేరకు త్వరలో ఎంతమందికి హక్కు పత్రాలు వస్తాయనేది తెలుస్తుందన్నారు. గ్రామాల్లో రైతులు వ్యవసాయ పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు బంద్ చేయకపోవడం వలన, పశువులు మృత్యువాత పడుతున్నాయని, సర్పంచులు గ్రామాల్లో చాటింపు వేయించి రైతులకు అవగాహన కల్పించాలని పశువైద్యాధికారి శ్రీకాంత్ సమావేశం దృష్టికి తెచ్చారు. మండలంలో 86శాతం పదవ తరగతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించామని, 23 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, జూన్ 2 నుండి 9 వరకు బడిబాట కార్యక్రమం చేపడతామని ఎంఈఓ శ్రతు నాయక్ తెలిపారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా, మిషన్ భగీరథ అస్తవ్యస్తంగా తయారైందని ఎంపీటీసీలు వెంకటయ్య, శారద, సర్పంచులు క్రిష్టిపాటి అంజిరెడ్డి, నరసింహులు అధికారులను నిలదీశారు. మండల పరిషత్ నుంచి ఆర్థిక సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీపీ గోపాల్‌నాయక్ అధికారులను కోరారు. మండల వ్యవసాయ అధికారి రాజు మాట్లాడుతూ తమ కార్యాలయానికి సుమారు 6 లక్షల వరకు అద్దె బకాయిలు రావాలని, కనీసం ఒక అటెండర్ కూడా లేని పరిస్థితి ఉందని సమావేశం దృష్టికి తెచ్చారు. రైతులకు ప్రభుత్వం అందించే రైతుబంధు పథకానికి కొత్తగా పాస్ బుక్కులు వచ్చినవారు జూన్ 16 తర్వాత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండలంలో ఇప్పటివరకు 80 మంది రైతులకు భీమా వర్తించింది అన్నారు. పంటల బీమా అనేది ప్రభుత్వ ఆధ్వర్యంలో లేదని, రైతులు బ్యాంకు నుండి పంట రుణం పొందే సమయంలో ఇన్సూరెన్స్ అమలు చేస్తారని దానిపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ రుణాలు పొందిన రైతులు సకాలంలో రెన్యువల్ చేసుకొని, మండల వ్యవసాయ సహకార సంఘం సేవలను మరింతగా పొందాలని, పిఎసిఎస్ చైర్మెన్ సత్యనారాయణరెడ్డి సూచించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని విరివిగా అమలు జరిపి ఎక్కువ పని దినాలు కూలీలకు కల్పించాలని ఎంపీపీ అధికారులను కోరారు. గుండెబోయిన గూడెం, ఎల్లాపురం, తరతర అన్ని గ్రామాల్లో పల్లె ప్రగతిలో భాగంగా గుర్తించిన కరెంటు సమస్యలకు నేటికీ పరిష్కారం దొరకలేదని పలువురు అధికారులను ప్రశ్నించారు. ఎన్‌ఆర్‌జీఎస్ కింద శాంక్షన్ అయి చేసిన పనులను, ఎప్పటికప్పుడు తమ కార్యాలయంలో పెండింగ్ లేకుండా ఎఫ్‌డీఓ జనరేట్ చేసి పంపిస్తున్నామని ఎంపీడీవో వెంకటాచారి సమావేశం దృష్టికి తెచ్చారు. రోడ్ల భవనాలు శాఖ కింద మండలంలో ఉన్న ఐదు ప్రధాన రహదారులకు పూర్తిస్థాయి మరమ్మతులు చేయించాలని సమావేశం అభిప్రాయపడింది. మండలంలో కొత్తగా ఏడు గ్రామ పంచాయతీ భవనాలు శాంక్షన్ అయినట్లు, జూన్ 2 నుండి 22 వరకు తెలంగాణ శతాబ్ది ఉత్సవాలను గ్రామస్థాయిలో నిర్వహించాలని, ఎంపీఓ దయాకర్ సూచించారు. వృద్ధాప్య పెన్షన్ తీసుకునే వృద్ధుడు మరణిస్తే, ఆ పెన్షన్ భార్యకు వర్తింపజేయడంలో ఆలస్యం చేయవద్దని అధికారులను సమావేశం కోరింది. ఈ సమావేశంలో ఎంపీటీసీలు కవిత, మీసాల ఉపేందర్, సర్పంచులు నంబూరు కృష్ణారెడ్డి, కిష్టపాటి అంజిరెడ్డి, నరసింహ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## త్వరలో రచ్చబండ కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ-పాలకీడు

తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని బొత్తల పాలెం గ్రామంలో త్వరలో విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యత అనే అంశంపై రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆ వేదిక జిల్లా అధ్యక్షుడు ధనమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమ సన్నాహక సమావేశంలో భాగంగా బుధవారం గ్రామ సర్పంచ్ భోగాల వీరారెడ్డిని కలిసి కరపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యత, ప్రభుత్వ పాఠశాలలను నిలబెట్టుకోవాలి అనే అంశంపై కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామంలో ఉండే ప్రజాప్రతినిధులు, మండలంలోని స్వచ్ఛంద సంస్థ సభ్యులు విరివిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ వేదిక కు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్, పౌరుస్పందన వేదిక జిల్లా కార్యదర్శి బిక్షపతి, కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్ నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటరమణ, విశ్రాంత ఉపాధ్యాయుడు సన్నిధి చిన్న మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు



- మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-మునగాల

వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని విద్యుత్ శాఖా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కోటి 56 లక్షలతో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరికీ ఆధునిక వైద్యం అందుబాటులో ఉంచాలనేదే ముఖ్యమంత్రి సంకల్పమని తెలిపారు. అరోగ్యవంతమైన తెలంగాణగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నిర్ణయించారని తెలిపారు. పల్లె నుండి పట్టణం వరకు అందుబాటులో వైద్య సేవలందించేందుకు వీలుగా ఎక్కడికక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణా సమాజం వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలివస్తున్నారన్నారని గుర్తుచేశారు. పల్లె నుండి పట్టణం వరకు బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసిన ఘనత యావత్ భార త దేశంలో ఒక్క తెలంగాణా రాష్ట్రానికే దక్కిందని చెప్పారు. అనంతరం 154 మంది కళ్యాణ్ లక్ష్మీ షాదీ ముబారక్ లబ్దిదారులకు ఒక కోటి 54 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. 21 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్దిదారులకు 6,77,500 విలువగల చెక్కులను ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ అధ్యక్షులు సుంకర అజయ్ కుమార్, ఎంపీపీ ఎలకా బిందు నరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ నలపాటి ప్రమీల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మెన్లు కందిబండ సత్యనారాయణ, తొగరు సీతారాములు, మునగాల సర్పంచ్ చింతకాయల ఉపేందర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్, తహసీల్దార్ జోహార్ లాల్, పంచాయితీ రాజ్ డీఈ పాండు నాయక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రభుత్వ అధికారులు, పాల్గొన్నారు.



## వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల సెర్ప్, వీవోఏల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే సైదిరెడ్డికి ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి పలుమాలు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదన్నారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించిన అనంతరం వారు చేస్తున్న సమ్మె విరమిస్తున్నట్లు, విధుల్లో తిరిగి జాయిన్ అవుతున్నట్లు తెలిపారు. తమ సమస్యల గురించి అసెంబ్లీలో ప్రస్తావించిన ఒకే ఒక ఎమ్మెల్యే సైదిరెడ్డి అని, ఆయనపై పూర్తిగా తమకు నమ్మకం ఉందని, తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ నాయకులు, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆర్థిక భరోసా

నవతెలంగాణ- అర్వపల్లి

మహిళ సమ్మన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకం మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు అన్నారు.బుధవారం మండల పరిధిలోని కొమ్మల గ్రామంలో ఈ పథకం పై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలపరిమితి గాను కనిష్టంగా 1000,గరిష్టంగా రెండు లక్షల వరకు డిపాసిట్ చేసుకొనే అవకాశం ఉందని ఇందుకు గాను గరిష్టంగా 7.5శాతం వడ్డీ రేటు లభిస్తుందన్నారు.అనంతరం గ్రామంలో 110 సేవింగ్ అకౌంట్లు తెరిచిన బీపీఎం ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్స్పెక్టర్ గౌనీ సురేష్ గౌడ్,సర్పంచ్ వెంకటమ్మ , ఉప సర్పంచ్ రేణుక,ఏం. ఓ అప్పయ్య,బీపీఎం లు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయంగా ఎదుర్కోలేకనే అభివృద్ధి ప్రదాత డాక్టర్ గాదరి కిషోర్ కుమార్‌పై ప్రతిపక్షాల ఆరోపణలు

- ఎంపీపీ కవిత రాములు గౌడ్

నవతెలంగాణ -తుంగతుర్తి



తుంగతుర్తి ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ ను రాజకీయంగా ఎదుర్కోలేకనే ప్రతిపక్ష నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎంపీపీ గుండగాని కవిత రాములు గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకునిగా ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన యువకిశోరం గాదరి కిషోర్ పై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని అన్నారు. బీడు భూములతో ఎడారిగా ఉన్న తుంగతుర్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలంగా మార్చిన ఘనత కిషోర్ కుమార్ దే అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే ఎమ్మెల్యే దొరకడం నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. ప్రతిపక్షాలు ఎవరెన్ని వేషాలు వేసిన యాట్రిక్ దిశగా మూడోసారి అధిక మెజార్టీతో కిషోర్ అన్న గెలవడం తథ్యమన్నారు.



## శ్రమదానంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రవి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ చైర్మెన్ గెల్లి అర్చన రవి కమీషనర్ వెంకటేశ్వరతో కలిసి 26వ వార్డులో జరుగుతున్న పనులను పరిశీలించిన అనంతరం శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా పూర్తి స్థాయిలో డ్రయినేజీలను శుభ్రం చేయాలని, రోడ్ల వైపున్న పిచ్చి మొక్కలను తొలగించాలని మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా వార్డులో దుస్తులను, బొమ్మలను సేకరించి అదే వార్డులో నివసిస్తున్న చిన్నపిల్లలకు, పేదలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ రాజశేఖర్, శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గేల్లీ రవి, జవాన్లు, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అవినీతి నియంతృత్వం పై ప్రజల తిరుగుబాటు మొదలైంది

నవతెలంగాణ -చివ్వేంల

దేశంలో జడలు విప్పి నాట్యం చేస్తున్న అవినీతి నియంతృత్వ పాలకుల పై ప్రజల తిరుగుబాటు మొదలైందని దానికి నిదర్శనమే నిన్న కర్ణాటకలో జరిగిన ఎన్నికల ఫలితాలని తెలంగాణ జన సమితి చివ్వెంల మండల అధ్యక్షుడు సుమన్ నాయక్ అన్నారు. జూన్ 4న సూర్యాపేటలో నిర్వహించే తెలంగాణ జన సమితి రాష్ట్ర మూడో ప్లీనరీని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని జయరాం గుడి తండా గ్రామపంచాయతీ లో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పాలకులు ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా తమ రాజకీయ ఎజెండా కోసం యథేచ్ఛగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు అఖిల్ ,శ్రీను నాయక్, లింగ, దేవజీ, భాష నాయక్, కిమతదితరులు పాల్గొన్నారు.

# అఖిలపక్ష నాయకుల ముందస్తు అరెస్టు



నవతెలంగాణ -అర్వపల్లి

అఖిలపక్ష నాయకులను తూలనాడిన ఎమ్మెల్యే గాదరి కిషోర్ వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం తిరుమలగిరిలో జరిగే అఖిలపక్షాల ధర్నా కార్యక్రమంలో పాల్గొనకుండా సీపీఐ(ఎం) బీజేపీ, కాంగ్రెస్, నాయకులను ముందస్తు అరెస్టులు చేసి అర్వపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టు అయిన వారిలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వజ్జ శ్రీనివాస్ నాయకులు బైరబోయిన నాగయ్య, మండల ప్రధాన కార్యదర్శి పాక వీరేష్ యాదవ్,తుంగతుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, నర్సింగ శ్రీనివాస్ గౌడ్, , యూత్ కాంగ్రెస్ నాయకులు వేల్పుల రమేష్, శిగ నసీర్ గౌడ్, కమిటీ రాజు, నోముల నరేష్, మేకల రాంబాబు, శ్రీకాంత్, మనోహర్, సతీష్, కిరణ్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## బడుగు బలహీన వర్గాల కోసమే టీడీపీ

**చిలుకూరు:**బడుగు బలహీన వర్గాల కోసమే తెలుగుదేశం పార్టీ పుట్టిందని ఆ పార్టీ చిలుకూరు మండల కన్వీనర్ కొండా సోమయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్‌ఎన్‌ఆర్ కాలనీకి చెందిన టీఎన్‌ఎఫ్ నాయకులు తలారి పుల్లారావు వారి తల్లిదండ్రులు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన వారిని పరామర్శించి మాట్లాడారు. ఆనాడు ఎన్టీ రామారావు పేద బడుగు బలహీన వర్గాల కోసమే తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు తన వంతు సహాయంగా 50 కేజీల బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రచార కార్యదర్శి కొల్లు సత్యనారాయణ 25 కేజీల బియ్యం అందించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు షేక్ మస్తాన్, గుండు వీరబాబు, టీఎన్‌ఎఫ్ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్టా నాగరాజు, తలారి జానకిరాములు, షేక్ కాజా, మరీదు శీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నరసింహస్వామి నిత్యకల్యాణం



**మఠంపల్లి:**శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి నిత్యకళ్యాణం బుధవారం దేవాలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయచార్యులతో శాస్త్రోతముగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, చెన్నూరు మట్టపల్లిరావు, కార్యనిర్వహణాధికారి సిరికొండ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన



**హుజూర్‌నగర్‌రూరల్**: వేపలసింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆరోగ్య శిబిరం, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల వైద్యాధికారి డాక్టర్ సన హాజరై మాట్లాడారు. పరిసరాల పారిశుద్ధ్యం ద్వారా ప్రజలు మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. గత రెండు రోజులుగా గ్రామంలో కొత్త జ్వరాలు నమోదు కాలేదని 8 మంది రక్త నమునాలు సేకరించి జిల్లా కేంద్రానికి పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అన్నెం శిరీష కొండారెడ్డి, మండల ఆరోగ్య విస్తర్ణ అధికారి ప్రభాకర్, పీహెచ్ఎన్ నూర్జహాన్, ఉదయగిరి, శ్రీను, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, పి.సావిత్రి, స్వరూపరాణి, కార్యదర్శి పెండెం నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## లింగ నాయక్‌కు నివాళ్లు

**పెన్‌పహాడ్:**మండల పరిధిలోని మాచారం గ్రామం ఆవాసం గుడిబండ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగా నాయక్ బుధవారం మరణించారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూముల సురేష్‌రావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష రూపాయల విరాళం

నవతెలంగాణ -భువనగిరిరూరల్



బండసోమారంలో దుర్గమ్మ పండుగలో పాల్గొని , డీసీసీ అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ నానం పద్మా కృష్ణ గౌడ్, శ్రీధర్, చిక్కుల వెంకటేష్, ఎంపీటీసీ పాశం శివా నాంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మండల దీక్ష

నవ తెలంగాణ - రాజాపేట

రాజపేట మండలంలోని రఘునాధపురం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ చేస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారం 288వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకి చల్లురిచిన్నపోచయ్య, బింగిసత్యనారాయణ, తుంగబలరాజు, రచ్చనర్సింహులు, గోశికిరన్, కలకుంట్లమైసయ్య, కలకుట్లకొమురయ్య, కటకంనగేష్ కటకంశివ, చల్లురుకోటయ్య, చల్లురుబలస్వామి, బల్లనరహరి ,కటకంప్రశాంత్, కటకంగణేష్, మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గాడి పల్లి శ్రవణ్, ఎంపిటిసి బుడిగే రేణుక పెంటయ్య గౌడ్ ఉప సర్పంచ్ పల్లె ప్రవీణ్, మాజీ సర్పంచ్ నరేందర్, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

## పల్టీ కొట్టిన తుఫాన్ వాహనం

- తప్పిన పెను ప్రమాదం
- ముగ్గురికి స్వల్పగాయాలు

నవతెలంగాణ- మోటకొండూర్



అదుపు తప్పి తుఫాన్ వాహనం పల్టీ కొట్టిన సంఘటన బుధవారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుండి తోర్రురు వెళ తునున్న తుఫాన్ వాహనం మండలంలోని ముత్తిరెడ్డి గూడెం మోత్కూరు రాయగిరి ప్రధాన రహదారిపై వస్తున్న సమయంలో దాబాల వద్ద ఒక వ్యక్తి సైకిల్ నడిపించుకుంటూ వాహనాకి ఎదురుగా వచ్చాడు. వాహనాన్ని ఆపడానికి ప్రయత్నం చేసే సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది.డ్రైవర్ చాకచక్యం ప్రదర్శించడంతో ప్రమాదం తప్పింది .ఇందులో డ్రైవర్ తో సహా 11 మంది ప్రయాణిస్తుండగా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి .గాయాలైన వారిని ముత్తిరెడ్డిగూడెంలోని ప్రాథమిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి అనంతరం అంబులెన్స్‌లో భువనగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు .

## పిడుగుపాటుకు వ్యక్తి మృతి

నవతెలంగాణ -సంస్థాన్ నారాయణపురం

పిడుగు పడి ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని సర్వేల గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సర్వేలో గ్రామపంచాయతీ పరిధిలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎల్లంకి శేఖర్(40) సర్వేల గ్రామానికి చెందిన బాలగోని చంద్రయ్య సాయపల్లం వద్ద పొలం దున్నేందుకు వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షానికి పిడుగు పడటంతో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య,కొడుకు, కూతురు ఉన్నారు.

## డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-గుండాల



మండలంలోని మరిపడిగ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యూనియన్ సభ్యుడు సజ్జన సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను గ్రామ ట్రాక్టర్ యూనియన్ సభ్యులు బుధవారం పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యూనియన్ సభ్యులు అనంతుల చంద్రశేఖర్,కొండబోయిన సోమన్న,చొప్పరి సోమన్న,తేర్యాల మహేందర్, సోమయ్య, సత్తయ్య, చంద్రయ్య, రాజేందర్, ఉప్పలయ్య, యాకన్న, ఎల్లేష్, రామ్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు

మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన కందుకూరి వెంకటయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు.ఆయన మృతదేహానికి గుండాల మండలం ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బజ్జూరి నాగరాజు సభ్యులు ఇమ్మడి దశరథ,కాసం నాగేష్,శామిశెట్టి శ్రీనివాస్, సతీష్, కిరణ్, రమేష్, కోటి తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలి

నవ తెలంగాణ -భూదాన్ పోచంపల్లి

అన్యాకాంత్రమైన ప్రభుత్వ భూములపై అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం శ్రీ మిత్ర టౌన్‌షిప్ భూమిని పరిశీలించి మాట్లాడుతూ మున్సిపల్ కు సంబంధించిన భూమి 8 వేల గజాలు భూమి బై నెంబర్లు వేసి అక్రమంగా రిజిస్టర్లు చేసి మున్సిపల్ సంబంధించిన 5 ఎకరాలు భూమిని అమ్ముకొని కోట్ల రూపాయలు దండుకున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి ఎవరైతే అక్రమాలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ భూమిని మున్సిపల్ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

నవతెలంగాణ -ఆలేరుటౌన్

ఆలేరు పట్టణం, మండలంలోని ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు కబ్జాలకు గురికాకుండా పరిరక్షించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐఎన్టీయూసీ జిల్లా కార్యదర్శి ఎగ్గిడి మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలేరు పట్టణంలో 1026 సర్వే నెంబర్లు పేదలకు నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఉన్న ప్రాంతానికి ఎదురుగా ఉన్న దాదాపు 30 గుంటల ప్రభుత్వ భూమిని అధికార పార్టీ, మరికొందరు కలిసి ఇటీవల ప్రభుత్వ భూమిని,కబ్జా చేసేందుకు ప్రయత్నించరని ప్రభుత్వ అధికారుల స్పందించి వెంటనే స్పందించారని గుర్తు చేశారు.10 26 సర్వే నెంబర్లు ఉన్న ఖాళీ స్థలాలను డబుల్ బెడ్ రూమ్ రానీ పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు పట్టాలు చేసి ఇవ్వాలని కోరారు.



## కొమ్మాయిగూడెంలో కంటి వెలుగు వైద్య శిబిరం

నవతెలంగాణ- రామన్నపేట

మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో బుధవారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని స్థానిక ఎంపీపీ జ్యోతి, గ్రామ సర్పంచ్ జల్లెల లక్ష్మమ్మ పెంటయ్య, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్ ప్రారంభించారు. ఈ కార్యమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శిరీష, క్యాంపు వైద్యాధికారి డాక్టర్ చందస్వి, మునిపముపుల పిహెచ్‌సి, హెచ్ఈఓ గోపాల్, సూపర్వైజర్ వాణిశ్రీ, ఏఎన్ఎం మంజుల, ఆశా వర్కర్లు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల్లో అన్ని రకాల సరుకులు అందేలా చూడాలి

**ఆలేరుటౌన్ :** రేషన్ షాపుల్లో ప్రజలకు అన్ని రకాల నిత్యవసర సరుకులు అందేలా చూడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయం ఆవరణలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలని, కంట్రోల్ బియ్యం రానివాళ్ల బియ్యం ఇవ్వాలని ,అర్హులైన పేదలకు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కేసీఆర్ పరిపాలన పేదలకు పెట్టే పథకాలు ఇంప్లిమెంట్ జరుగుతలేవని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పేరు పైలయ్య ,సిహెచ్ రాజారెడ్డి, బొడ్డు ఆంజనేయులు ,పల్లె శీను , తెడ్డు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కుంటల్లో మట్టిని అక్రమంగా తోడేస్తున్నారు

- ఒకచోట ధ్వంసం.... మరోచోట ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- రెండు వారాల్లో రెండు కుంటలు ధ్వంసం

నవతెలంగాణ -రామన్నపేట



రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మాటల్లో చెప్పాలంటే 'చెరువులు, కుంటలు మన పూర్వీకులు మనకు అందించిన అపురూపమైన జల వనరులు.. మన పూర్వీకులు పడిన వాననీరు ఎక్కడ నిలువ ఉండకుండా వేగంగా ప్రవహించి వృథాగా వెళ్లపోకుండా నీరు ప్రవహించే ప్రాంతాలలో అడ్డుగా కట్టలు కట్టి కుంటలు, చెరువులు తొవ్వించి వాటికి అలుగులు ఏర్పాటు చేసి, ఎక్కడి వర్షపు నీరు అక్కడే నిల్వ ఉండేటట్లుగా ఏర్పాటు చేశారు.

నేటి పాలకులు కోట్లాది రూపాయలు వెచ్చించి అలాంటి కుంటల్లోని, చెరువుల్లోని పూడిక తొలగిస్తూ కాపాడే ప్రయత్నం చేస్తుంటే... కొందరు అక్రమార్జనాపరులు నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఆధునిక యంత్రాలను పెట్టి కుంటల్లోని, చెరువుల్లోని మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటు ధ్వంసం చేస్తున్నారు. స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు సమాచారం అందించిన మండల స్థాయి ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మరికొన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో మట్టి పోసి ఆక్రమణకు పాల్పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఇటీవల ఒక కుంటను సందర్శించి, సర్వే చేసి ఆక్రమాలను తొలగించాలని ఆదేశించిన నేటి వరకు అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

15 రోజుల క్రితం మండలంలోని కుంకుడుపాముల గ్రామంలోని బొక్కొళ్ళ (బోక్కోని) గుంటలో అక్రమంగా మట్టిని తొవ్వి తరలించగా, మంగళవారం ఎన్నారం మధిర గ్రామమైన కక్లోని కుంట గ్రామంలోని మెలబావి కుంట లో హిటాచి యంత్రాన్ని పెట్టి సుమారు 15 ఫీట్ల లోతు వరకు మట్టిని తోడుకొని తరలించారు. స్థానికులు సమాచారాన్ని తహసిల్దార్ కి అందించగా తహసిల్దార్ స్పందించి రెవెన్యూ సిబ్బందిని పంపి మట్టిని తొవ్వకుండా అడ్డుకున్నారు. కుంటలోని మట్టిని తరలించిన వారిపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడంతో ఇంతేలే అనుకుంటూ కొందరు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల ఆశీస్సులతో మట్టిని కొడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుంటల్లోని మట్టిని అక్రమంగా తరలించిన వారిపై, సహకరించిన వారిపై కేసులు నమోదు చేయాలని, త్రవ్విన కుంటల్లోని గుంటలను మట్టిపోసి నింపేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుచున్నారు.

## వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- డీసీసీ అధ్యక్షులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

నవ తెలంగాణ- భువనగిరి రూరల్

వడ్ల కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నానుద్దేశించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యంను కొనుగోలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సర్టిఫైడ్ చేసి ఏ గ్రేడ్ ధాన్యంగా నమోదు చేసిన తర్వాత మిల్లర్లు బి గ్రేడ్ గా ఉందని అనడంతో రైతులు ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ విషయంపై ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ధాన్యం ఏ గ్రేడు, బీ గ్రేడు ప్రమాణాలతో రైతులను ఇబ్బందులకు గురి చేయడం ధాన్యం తరుగు పేరుతో రైతులను ప్రభుత్వం పూర్తిగా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. తరుగు పేరుతో ధాన్యంను తొలగించడం పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు కలెక్టర్ కార్యాలయంలో దుసుకెళ్లేందుకు ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ కడుదుల నగేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిక్కుల వెంకటేశం, మజహర్, శివనంద్, అవైస్చిస్తే, కూర వెంకటేశ్, పాక మల్లేష్ యాదవ్, సత్తిరెడ్డి, బొల్ల శ్రీను, జంగయ్య యాదవ్, గడ్డమీది వీరస్వామి గౌడ్, శంకరా బాబు గౌడ్, కొండల్రెడ్డి, నాగరాజు, నుచ్చు నాగయ్య యాదవ్, పాక వెంకటేష్ యాదవ్, మహేశ్ పాల్గొన్నారు.



## ఆలేరులో ప్రభుత్వ భూమికి అక్రమ పట్టా



నవతెలంగాణ- ఆలేరు రూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు హరిత హారం పేరుతో..అడవులను సంరక్షిస్తూ పల్లెల్లో ప్రకృతి వనాలను పెంపొందించేందుకు కృషి చేస్తుంటే....అదే రాష్ట్ర ప్రభుత్వంలోని కొంతమంది అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారుల అండదండలతో ప్రభుత్వం కేటాయించబడిన భూమిలోని పల్లె ప్రకృతి వనాలను కాజేసిన ఘటన ఆలేరు మండలం మదనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.

ఆలేరు మండలం మదనపల్లి గ్రామంలో పల్లె ప్రకృతి వనంకు కేటాయించబడిన ప్రభుత్వ భూమిని (సర్వే నెంబర్ 950/2 (30 గుంటలు),894/2 (1.10)గుంటల భూమిని అక్రమ పట్టా చేసుకున్నారు ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య వియ్యంకుడు. పల్లె ప్రకృతి వనంకు కేటాయించబడిన ప్రభుత్వ భూమిలో వివిధ రకాలకు చెందిన 1400 మొక్కలు నాటారు. గత రెండు సంవత్సరాల నుండి గ్రామపంచాయతీ ఆధీనంలో పల్లె ప్రకృతి వనాన్ని సంరక్షిస్తున్నారు. ఎప్పటి నుండో ఈ భూమి పై కన్నేసిన మున్సిపల్ చైర్మన్ శంకరయ్య వియ్యంకుడు రిటైర్డ్ ఎంఈఓ కడకంచి కిష్టయ్య, తన తల్లి కడకంచి చిన్న సోమక్క పేరు పై తహసీల్దార్‌తో కుమ్మక్కై, అక్రమ పట్టా చేపించారు.

.ఈ విషయం పై మందనపల్లి సర్పంచ్ కోటగిరి పాండరి స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి తమ ఊరికి జరిగిన అన్యాయంపై... న్యాయం చేయాలంటూ సర్పంచ్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు వినతి పత్రం ఇచ్చారు. అంతకు ముందే ఆలేరు తహసీల్దార్ రామకృష్ణ ను కలిసి వినతి పత్రం అందజేశారు.ప్రజా సమస్యలు పట్టించుకోకుండా, తహసీల్దార్ కార్యాలయానికి రాకుండా వివాదాస్పద భూములలో తలదూరుస్తున్నారన్న ఆరోపణలు తహసీల్దార్‌పై అనేకం ఉన్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులే ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నాయకులకు కట్టబెట్టడం పై సర్వత్ర విమర్శలకు దారితీస్తుంది. దీనిపై ఉన్నతాధికారులు తహసీల్దార్ పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

**తహసీల్దార్ వివరణ :** ఈ విషయంపై ఆలేరు తహసీల్దార్ రామకృష్ణను వివరణ కోరగా తనకు పై అధికారుల నుండి, సీఎం పేషి నుండి ఫోన్ చేస్తే. పని చేసి పెట్టానని సమాధానం ఇచ్చారు. పైగా తనకు రెండు రోజుల గడువు ఇస్తే తిరిగి మళ్లీ భూమిని ప్రభుత్వ ఖాతాలో చేర్చుతాం. మీడియా ప్రతినిధులు తహసీల్దార్ రామకృష్ణను బీఆర్ఎస్ నేతలకు భూమిని పట్టా ఎందుకు చేశారని వివరణ అడగగా మళ్లీ వస్తానంటూ తహసీల్దార్ ఆఫీస్ నుండి బయటకు వెళ్లారు.



## అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ -వలిగొండ రూరల్

మండలంలోని అరూరు గ్రామంలో , మత్స్యగిరి గుట్ట వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం భువనగిరి శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి కాలనీలో తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పలు ప్రజా సమస్యలపై స్పందిస్తూ వాటికి పరిష్కార మార్గాలను కూడా తెలిపారు. అదేవిధంగా మత్స్యగిరి గుట్ట వద్ద ఉన్న అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మెట్ల మార్గం కుండా ఘాట్ రోడ్డును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకి విన్నవించారు, తక్షణమే ఈ రోడ్డుని చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరూర్ సర్పంచ్ చిట్టెడ్డి జయమ్మ జనార్దన్ రెడ్డి, అరుర్ పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మాజీ జెడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్ , ఎంపీటీసీ పలుసం రమేష్, జినుకల దానయ్య,నాగరాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి నిరోధకులుగా మారుతున్న ప్రతిపక్ష నాయకులు

నవతెలంగాణ-మోత్కూరు



తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మారుతున్నారని ఓయూ జేఏసీ నాయకుడు మర్రి అనిల్ కుమార్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అక్రమ సంపాదన, హింస, దాడులకు పాల్పడుతున్నారని అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మించేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారని, నిత్యం ఎమ్మెల్యే ప్రజల్లో ఉండి సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా ఉంటున్నారని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని, ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తూ కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నారన్నారు. ఒకప్పుడు నియోజకవర్గం ఫ్యాక్షన్ రాజకీయాలకు నిలయంగా ఉండేదని, ఇప్పుడు అలాంటి పరిస్థితులేవీ లేవని, ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కిశోర్ కుమార్ తెలంగాణ ఉద్యమ నాయకునిగా ఎదిగారని, ఆయన తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులుగా ఆ కుటుంబం ఉన్నతంగా బతికిందని, ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలకుపాల్పడుతున్నారని ప్రతిపక్ష నాయకులు పైశాచిక ప్రచారానికి దిగారని, ప్రజల బాగోగులు, అభివృద్ధిపై మాట్లాడే దమ్ము లేక ఇలాంటి చిల్లర రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధిని చూసే ప్రజల ఆదరాభిమానాలతో కిశోర్ కుమార్ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని, ప్రజాభిమానంతోనే కిశోర్ హ్యాట్రిక్ గెలుపు ఖాయమన్నారు.

## బీజేపీ మతోన్మాద కుట్రలను అడ్డుకోవాలి

నవ తెలంగాణ-మోత్కూర్




బీజేపీ మతోన్మాద కుట్రలను అడ్డుకోవాలని, అందుకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకికవాదులంతా ఏకమై పోరాడాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి పిలుపునిచ్చారు. మోత్కూరు మండలం పొలడుగు గ్రామంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం బుధవారం మామిడి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల మోడీ పాలనతో ప్రజలు విసిగి పోయారని, ధరల భారం, నిరుద్యోగం, ఉపాధి లేకపోవడంతో ప్రజల జీవితాలు చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ, అమిత్ షా మతం పేరుతో ప్రజలను ఎంతగా రెచ్చగొట్టినా పట్టించుకోవడం లేదని, అందుకు కర్ణాటక ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఘోరంగా ఓడించడమే నిదర్శనమన్నారు. కర్ణాటక ఎన్నికలతోనే బీజేపీ పతనం ప్రారంభమైందన్నారు. లౌకిక భారత దేశంలో హిందువులు, ముస్లింలు, ఇతర అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి శాంతియుత జీవనం గడుపుతున్నారని, ప్రశాంతంగా ఉన్న దేశంలో బీజేపీ స్వార్థ రాజకీయం కోసం మతపిచ్చు పెట్టి దేశ సమైక్యతను దెబ్బతీస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలైన డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని, ధరణి సమస్యలను పరిష్కరించాలని, వీఆర్ ఏ, జేపీఎస్ తరహాలో గ్రామ పంచాయితీ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్ వాడి టీచర్లు, ఆయాలతో పాటు, ఇతర కార్మికుల సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు పైళ్ళ రాంరెడ్డి, రాచకొండ కనకయ్య, పానుగుల రమేష్, దడిపల్లి ప్రభాకర్, కొంపల్లి ముత్తమ్మ, పిట్టల చంద్రయ్య, వెండి యాదగిరి, చింతకింది సోమరాజు, వడ్డేపల్లి లక్ష్మణ్, కొంపల్లి గంగయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సునీత చొరవతో ఆలేరు పట్టణాభివృద్ధికి కృషి

**ఆలేరుటౌన్:** రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆలేరు పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ వార్డులలో అభివృద్ధి పనులకు ఇటీవల ఎమ్మెల్యే సునీత శంకుస్థాపన చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో సంక్షేమం,అభివృద్ధి, ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివి అని , రాష్ట్రంలో ప్రతి ఇంటికి పథకాలు చేరుతున్నాయని పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గం కేంద్ర అభివృద్ధికి ఎమ్మెల్యే పాటూ పాడుతున్నారని ,ప్రతిపక్షాలు ఎమ్మెల్యే సునీత పై బురద జల్లడం మానుకోవాలని పేర్కొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని మరోచోటికి మార్చాలి



నవతెలంగాణ -వలిగొండ రూరల్

మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామంలో పల్లె దవాఖాన ప్రహరీ గోడ లోపల ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని వెంటనే అక్కడి నుండి తొలగించి మరోచోటికి మార్చాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. బుధవారం రేపాక గ్రామంలో పల్లె దవాఖానను ఆ పార్టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించగా అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. పల్లె దవఖాన ప్రహరి గోడ లోపల విద్యుత్ స్తంభం ఉండడం వల్ల ఆసుపత్రికి వచ్చే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ఆస్పత్రి పైభాగం నుండి విద్యుత్ వైర్లు ఉండడం వల్ల ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని వెంటనే విద్యుత్ స్తంభాన్ని అక్కడనుండి మార్చి మరోచోట ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజు సుమారు 50 మంది వరకు ఓపి పేషెంట్లు ఆసుపత్రికి వస్తున్న ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేవని, కనీసం టాయిలెట్స్ లేకపోవడం వల్ల తీవ్రంగా అక్కడికి వస్తున్న ఉద్యోగులతో పాటు మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం బకాయిలో ఉన్న విద్యుత్ బిల్లులు 17వేల రూపాయలు చెల్లించకపోవడం వల్ల ఆసుపత్రిలో విద్యుత్ కనెక్షన్ తొలగించారని అన్నారు. వెంటనే మంజూరైన నూతన భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దొడ్డి బిక్షపతి జువ్వగాని చంద్రయ్య స్థానికులు వెల్వర్తి యాదయ్య నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## అండర్ పాస్ నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి

నవతెలంగాణ -ఆలేరుటౌన్

ఆలేరు ప్రాంత ప్రజల సౌకర్యార్థం రైల్వే గేట్ ఆవరణలో నిర్మించాల్సిన అండర్ పాస్ నిర్మాణం, ప్రభుత్వం సకాలంలో పూర్తి చేయాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగామ ఉపేందర్‌రెడ్డి మండల కేంద్రంలో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ పాస్ నిర్మాణాన్ని 100 రోజుల్లో పూర్తి చేయాలని, కాలయాపన చేస్తే ఆలేరు ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు.

# నల్లగొండ మెడికల్ కళాశాలకు 42 అసిస్టెంట్ ప్రొఫెసర్ల మంజూరు

- ఏకకాలంలో 42పోస్టుల మంజూరీ వైద్య రంగంలో నూతనాధ్యాయం
- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి జగదీశ్‌రెడ్డి

**నవతెలంగాణ-నల్లగొండ**

నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కొత్తగా 42 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేశారు. ఏక కాలంలో ఇంత మందిని నియమించడం ద్వార వైద్య రంగంలో నూతనాధ్యాయం సృష్టించినట్లైంది. జెనరల్ మెడిసిన్(5), జెనరల్ సర్జన్(6), ఆర్థోపెడిక్(2), పిడియాట్రిక్(4), ఓబీజీ (8),అనస్థీషియా(7) అనాటమీ(1) పథాలజీ,(1)మైక్రో బయలజీ(1), ఫోరెన్సిక్ మెడిసిన్(1), రేడియో డయాగ్నిస్ (2), బయో కెమిస్ట్రి (1), కమ్యూనిటీ మెడిసిన్ (1), ట్రాన్స్ ఫ్యుజన్ మెడ్ (1), ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ (1), చొప్పున వివిధ విభాగాలకు కలిపి మొత్తం 42 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. స్థానిక శాసనసభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి అభ్యర్థన మేరకు రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి చేసిన సిఫారులకనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. పేద ప్రజలకు వైద్య సేవల విస్తరణకు ఈ నియామకాలు దోహదపడతాయి.

**ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు**

ఇదిలా ఉండగా ఏకకాలంలో నల్లగొండ మెడికల్ కళాశాలకు 42 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల మంత్రి జగదీష్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికారంలోకి వచ్చాక విద్య, వైద్య రంగంలో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులకు ఈ నియామకాలు అద్దం పట్టుందనీ ఆయన పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాలకు వైద్య సేవల విస్తరణకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల ప్రక్రియ ఖచ్చితంగా దోహద పడుతుందని ఆయన అన్నారు. పేదలకు ఆధునిక వైద్యం అందుబాటులోకి తేవడమే కాకుండా అందుకు అనుగుణంగా నియామకాలను చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ సామాన్యుడిపై ఉన్న ప్రేమ ను మరోమారు చాటుకున్నారని మంత్రి జగదీష్ రెడ్డి కొనియాడారు.

**ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు**

**మంత్రులు జగదీశ్‌రెడ్డి, హరీష్ రావులకు కృతజ్ఞతలు**

**కంచర్ల భూపాల్‌రెడ్డి**

ఇదిలా ఉండగా ఏకకాలంలో సూర్యాపేట మెడికల్ కళాశాలకు 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల స్థానిక శాసనసభ్యులు కంచర్ల భుపాల్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందుకు సహకరించిన మంత్రులు జగదీష్ రెడ్డి, హరీష్ రావు లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికారంలోకి వచ్చాక విద్య, వైద్య రంగంలో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులకు ఈ నియామకాలు అద్దం పట్టుందనీ పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాలకు వైద్య సేవల విస్తరణకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల ప్రక్రియ ఖచ్చితంగా దోహద పడుతుందని ఆయన అన్నారు. పేదలకు ఆధునిక వైద్యం అందుబాటులోకి తేవడమే కాకుండా అందుకు అనుగుణంగా నియామకాలను చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ సామాన్యుడిపై ఉన్న ప్రేమ ను మరోమారు చాటుకున్నారని భూపాల్ రెడ్డి కొనియాడారు.



## ఉదారతను చాటుకున్న పగడాల ముత్తు

**నవతెలంగాణ-మర్రిగూడ**

అమ్మానాన్నలను కోల్పోయి అనాథలుగా మిగిలి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామానికి చెందిన మమత, మనిషా, శిల్ప, అనే ఆడపిల్లలకు పగడాల కనకయ్య మెమోరియల్ ఫౌండేషన్ చైర్మెన్ పగడాల ముత్తు ఆర్థికంగా ఆదుకొని ఉదారతను చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామానికి చెందిన పోలగోని కృష్ణయ్య యాదమ్మ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు మమత(17), మనిషా(14), శిల్ప(12). గత 11 సంవత్సరాల క్రితం పోలగోని కృష్ణయ్య చనిపోగ, మూడు సంవత్సరాల క్రితం యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. తల్లిదండ్రులు చనిపోయిన నాటి నుండి పెద్ద కూతురు మమత దినసరి కూలిగా మారి తను చదువుకుంటూ ఇద్దరు చెల్లెళ్లను చదివిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. బుధవారం చిన్నారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తెలుసుకున్న కనకయ్య మెమోరియల్ ఫౌండేషన్ చైర్మెన్ పగడాల ముత్తు ఆర్థికంగా వాళ్లకు అండగా నిలిచాడు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు మూడు నెలలకు సరిపడా రూ.15 వేలతో పాటు నిత్యావసర సరుకులు, ఇంటి నిర్మాణానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ముగ్గురు ఆడపిల్లలకు చదువులకయ్యే పూర్తి ఖర్చు ఫౌండేషన్ భరిస్తుందని, ప్రతినెల నిత్యవసర సరుకులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రఘు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## విజయవంతంగా సర్వసభ్య సమావేశం

**నవతెలంగాణ-చందంపేట**

చందంపేట మండలంలోని ముచ్చటగా మూడవసారి సర్వసభ్య సమావేశం బుధవారం విజయవంతంగా జరిగింది. చందంపేట ఎంపీపీ పార్వతి చందు నాయక్ మాట్లాడుతూ బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని ఈ కార్యక్రమానికి జెడ్పిటిసి నేనావత్ బుజ్జి లచ్చిరాం నాయక్ అని ఆమె తెలిపారు. జాతీయ ఉపాధి హామీలు కూలీలకు ప్రతిరోజు 300 రూపాయలు వచ్చే విధంగా చూడాలని ఆమె సూచించారు ప్రతి గ్రామపంచాయతీలో సర్పంచులు వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. రెండుసార్లు సర్వసభ్య సమావేశం పోస్ట్ పోన్ చేసి ఈరోజు జరుపుకోవడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు ప్రజా ప్రతినిధులు అంటే గ్రామ సమస్యలు పరిష్కరించడమే దేహం కానీ మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి వివిధ గ్రామాల నుండి సర్పంచులు ఎంపిటీసీలు హాజరు కాకపోవడం చాలా బాధ అని అన్నారు. గ్రామపంచాయతీలో తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆమె తెలిపారు గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ఎప్పటికప్పుడు సమస్యలు మండల స్థాయి అధికారులు తెలియజేయాలని ఆమె సూచించారు మండల స్థాయి అధికారులు ఏ సమస్య ఉన్న మా దృష్టికి తేవాలని ఆమె తెలిపారు జూన్ 5 నుంచి రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం నాయకుల చేతివాట జరుగుతుందని ఎలాంటి సమస్యలు జరుగకుండా చూడాలని అధికారులకు తెలిపారు. విద్యుత్ సమస్య మండలంలోని అనేక గ్రామాల్లో ఉన్నట్లు అచ్చంపేట పట్టి సర్పంచ్ విద్యుత్ శాఖ అధికారిని నిలదీశారు విద్యుత్ వైర్ల కింద చెట్లు ఏపుగా పెరిగి విద్యుత్ స్తంభాలను విద్యుత్ వైర్లకు తాకి గ్రామాల్లో విద్యుత్ సమస్య అనేక రకాలుగా మారిందని సభ దృష్టికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నేనావత్ బుజ్జి లచ్చి రామ్ నాయక్, వైస్ ఎంపీపీ జాలే ప్రేమలతనరసింహారెడ్డి, ఎంపిటీసీలు తంగెళ్ల రజిత రామకృష్ణారెడ్డి, కేతావత్ కోటి, లక్ష్మనాయక్, నోముల మల్లయ్య, రమావత్ మంజుల మోతీలాల్, ఇస్లావత్ సునీత, కో ఆప్షన్ నెంబర్ ఎండి సాదిక్ , సర్పంచులు జరుపల లోక్యానాయక్, బాలు లోకా నాయక్, శంకర్రావు, ఎంపీడీవో రాములు నాయక్, తాసిల్దార్ దేవదాస్ ,వ్యవసాయ అధికారి మల్లారెడ్డి పశు వైద్య అధికారి ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్ఆర్ఆర్ సెంటర్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**నవతెలంగాణ-దేవరకొండ**

స్వచ్ భారత్ ఉద్యమంలో భాగంగా మేరీ లైఫ్ మేరా స్వచ్ షహర్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్లను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాటికి మేరీ లైఫ్ మేరా స్వచ్ షహర్ అంటే మన జీవన విధానం మన పట్టణ పరిశుభ్రతను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సక్కు నాయక్, మెప్మా టీఎం సి జగమంత, వార్డ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మెప్మ ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



## వివాహ వేడుకల్లో పాల్గొన్న రవీందర్‌రెడ్డి

**నవతెలంగాణ-నాంపల్లి**

మండలంలోని పసునూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు వీరమల్ల శేఖర్‌గౌడ్ మౌనిక, మెళ్లవాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ వార్డు సభ్యులు పగిళ్ల మల్లేష్ కల్యాణిల వివాహ వేడుకలలో నాంపల్లి మండల రైతు బంధు సమితి కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్కే అబ్బాస్, బీఆర్ఎస్ నాయకులు సపవత్ సర్దార్, జల్లెల సైదులు, పసునూరు గ్రామశాఖ అధ్యక్షులు జింకల నరేష్, ధనుంజయచారి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పాలనలో అన్ని రంగాలు బలోపేతం

**నవతెలంగాణ- రామన్నపేట**

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిది సంవత్సరాల సూపరిపాలనలో రాష్ట్రంలోని అన్ని రంగాలు బలోపేతమయ్యాయని శోభనాద్రిపురం గ్రామ సర్పంచ్ కాల్వ యామిని శ్రవణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు రావలసిన పెండింగ్ బిల్లులన్నీ ఒకే దఫాలో విడుదల చేయడం హర్షణీయమన్నారు. గ్రామాలలో అభివృద్ధి మరింత వేగంగా సాగుతుందని తెలిపారు. పంచాయతీ రాజ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఆమె అన్నారు. పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ ఉద్యోగులుగా సర్వీస్ లోకి తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నాయకత్వంలో రామన్నపేట మండలం అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. రాము నా అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని ఆమె తెలిపారు.

## బ్యాడ్మింటన్‌లో సాయి ప్రియకు మొదటి బహుమతి

**నవతెలంగాణ- ఆలేరురూరల్**

మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన జాలపు సాయి ప్రియ సోమవారం జరిగిన బోనగిరి జిల్లా స్థాయి సీఎం కప్‌లో భాగంగా బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ప్రథమ బహుమతి సాధించింది. బుధవారం గ్రామ ఎంపీటీసీ జూకంటి అనురాధ అనిల్, ఉప సర్పంచ్ నీలా రామన్న సంతోషం వ్యక్తం చేసి శాలువాతో ఘనంగా సన్మానించారు..

## ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

**నవతెలంగాణ -తుంగతుర్తి**

ప్రజాస్వామిక దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరునికీ ఉంటుందని, ముందస్తు,అక్రమ అరెస్టులతో నిర్బంధించడం అప్రజాస్వామికమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా అన్నారు. తిరుమలగిరి మండల కేంద్రంలో అడ్వకేట్ యుగంధర్ పై దాడికి నిరసనగా ప్రతిపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా బుధవారం కాంగ్రెస్ ,బీజేపీ సీపీఐ(ఎం), ఎమ్మార్పీఎస్, బీఎస్పీ తదితర పార్టీల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తుందని, పోలీసు వ్యవస్థ మొత్తం కూడా ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ చెప్పు చేతుల్లో పనిచేస్తుందన్నారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ నాయకులు గంగరాజు, నాగరాజు తదితరులు ఉన్నారు.

## ధ్వజస్తంభం ఏర్పాటులో అపశృతి

- తప్పిన పెను ప్రమాదం

**నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్**

మిర్యాలగూడ మండలంలోని తుంగపాడులో బుధవారం ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ధ్వజస్తంభం నిలబెడుతుండగా అపశృతి నెలకొంది. క్రేన్ ద్వారా ప్రత్యేక పూజలతో ధ్వజస్తంభం నిలబెడుతుండగా ఒకసారిగా కింద పడింది. దీంతో ధ్వజస్తంభం మూడు ముక్కలైంది. ఆ సమయంలో భక్తులు పెద్ద ఎత్తున ఉండడం కింద పడుతుండగా అప్రమత్తమై పక్కకు జరగడంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో భక్తులు ఊపిరిపించుకున్నారు మహోత్సవంలో అపశృతి నెలకొనడంతో భక్తులు ఆందోళన చెందారు. కీడు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక పూజలు చేశారు.

# చివరి గింజ వరకు కొంటాం.. తప్పుడు ప్రచారం తగదు

- అదనంగా 450 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- దిగుబడి ఆలస్య నివారణకు ప్రత్యాన్మయ చర్యలు తీసుకోవాలి
- పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా పంట విస్తీర్ణం, ధాన్యం దిగుబడి బాగా పెరిగిందని, రైతుల వద్ద నుంచి చివరి గింజ వరకు మద్దతు ధరపై ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, పౌర సరఫరాల కమిషనర్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ధాన్యం కొనుగోలు అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు అంశంలో జిల్లా కలెక్టర్లు, అధికారులు తీసుకున్న చర్యల కారణంగా గత సంవత్సరం కంటే అధికంగా ధాన్యం కొనుగోలు చేశామని, అయినప్పటికీ క్షేత్రస్థాయిలో తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. గత సంవత్సరంలో 4.5 లక్షల రైతుల నుంచి 28 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే ఈ సంవత్సరం మే 23 నాటికి 6.4 లక్షల రైతుల నుంచి 38 లక్షల 50 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశామని గత సంవత్సరం కంటే అధికంగా 450 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని మంత్రి తెలిపారు. జిల్లాలో కురిసిన అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని సైతం రైతులు నష్ట పోవద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలలో రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడికి స్థల సమస్య ఉందని, దీనివల్ల లారీల మూమెంట్, మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి ఆలస్యం అవుతుందని, దీనిని నివారించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇంటర్మీడియట్ గోడౌన్లో భద్రపరచాలని, జిల్లాలో ఇంటర్మీడియట్ గోడౌన్ లను గుర్తించాలని మంత్రి ఆదేశించారు. రైస్ మిల్లుల వద్ద లోడింగ్, అన్లోడింగ్ సమస్య రాకుండా అధిక సంఖ్యలో హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని, జిల్లాల వారీగా అవసరమైతే లారీల సంఖ్యను పెంచాలని రైతుల వద్ద చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ, తడిచిన ధాన్యం ను కొనుగోలు చేసి మిల్లర్ లకు పంపించిన ధాన్యం మిల్లింగ్ చేసిన బాయిల్డ్ రైస్ ఎఫ్సీఐ తీసుకోవడం లేదని తెలియజేశారు. అంతేగాక 130 కొట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని వివరించారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి సమస్య రాకుండా అలాట్ చేసిన రైస్ మిల్లులు తప్పనిసరిగా ధాన్యం దిగుమతి చేసుకునేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షిస్తున్నామని, రైస్ మిల్లుల వద్ద స్థల సమస్య ఉంటే ప్రత్యామ్నాయ స్థలాల ఎంపిక చేపడుతామని, ప్రస్తుతానికి రైస్ మిల్లుల వద్ద అందుబాటులో ఉన్న స్థలంలో దాన్యం దిగుబడి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర్ రావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, పౌసరఫరాల సంస్థ మేనేజర్ నాగేశ్వర రావు, డి అర్ డి ఓ కాళిందిని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే క్రీడా పోటీలు

- రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిపై గురుతర బాధ్యత ఉంది
- జిల్లా పేరును చిరస్థాయిగా నిలిపేలా ప్రతిభ చూపాలి
- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



నల్లగొండలో జిల్లా కేంద్రం మేకల అభినవ్ స్టేడియం,ఇండోర్ స్టేడియం లలో ఈ నెల 22 నుండి 24 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన సీఎం కప్ 2023 జిల్లా స్థాయి క్రీడలు ఘనంగా ముగిసాయి.బుధవారం మేకల అభినవ్ స్టేడియం లో ముగింపు కార్యక్రమానికి నల్గొండ శాసన సభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే క్రీడా పోటీలు నిర్వహించాలని సంకల్పించి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. క్రీడల ద్వారా యువతలో స్నేహభావం పెంపొందుతుందన్నారు. అట్లాగే రోజు వ్యాయామం, క్రీడలలో పాల్గొనడం ద్వారా దేహదారుఢ్యం, ఆత్మస్థైర్యం, ధైర్యము, మొదలగునవి పెంపొందించుకోవచ్చని ఆయన అన్నారు. సీఎం ప్రోత్సాహంతో గ్రామస్థాయి క్రీడాకారులను గుర్తించి మండలాలలో పోటీలు నిర్వహించడం జరిగిందని అందులో ఎంపికైన వారిని జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో నల్లగొండ జిల్లా పేరు చిరస్థాయిలో నిలిచేలా మంచి ప్రతిభ కనబరిచి అన్ని క్రీడలలో ఉత్తమ బహుమతులు గెలుచుకోవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో పురుష విభాగంలో దామరచర్ల, నల్లగొండ, కేతపల్లి, స్త్రీ విభాగంలో నిడమనూరు, కేతపల్లి, చందంపేటలు విజేతలుగా నిలిచాయి. కో కో పోటీలలో పురుష విభాగంలో అడవిదేవులపల్లి, దేవరకొండ, గుర్రంపోడు, స్త్రీ విభాగంలో నల్లగొండ, కనగల్, నార్కట్ పల్లి విజయతలుగా నిలిచాయి. కబడ్డీలో పురుష విభాగంలో మిర్యాలగూడ, పెద్ద అడిశర్ల పల్లి, త్రిపురారం, స్త్రీ విభాగంలో అనుముల, కట్టంగూరు, త్రిపురారం విజేతలు గా నిలిచారు. ఫుట్ బాల్ లో మిర్యాలగూడ, గుర్రంపోడు, నల్లగొండ విజయతలుగా నిలిచాయి. అదే విధంగా షాట్ పుట్, లాన్గ్ జంప్, మొదలగు క్రీడలలో గెలుపొందిన వారికి ఆయన బహుమతులు ప్రధానం చేశారు. క్రీడా పోటీలలో భాగంగా నృత్య ప్రదర్శనలు చేసిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన పట్టు వస్త్రాలంకరణలో పాల్గొన్న సైదులుగౌడ్

నవతెలంగాణ-నల్లగొండరూరల్

నల్లగొండ మండలం కేశరాజ్‌పల్లి మూడవ వార్డుకు చెందిన జెర్రిపోతుల వీరస్వామి-స్వాతిల కుమార్తెలు సింధు-సిరిల నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమం ధర్వేష్ పురం లక్ష్మీ గణపతి ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ జెడ్పీటీసీ చంద్రం ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ తండు సైదులుగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో కనగల్ మండల నాయకులు చింతల విజయ్ కుమార్, జేర్రిపోతుల ఆంజనేయులు, జెర్రిపోతుల శంకర్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు కొంపల్లి రామన్న గౌడ్,కొప్పు కొండల్ గౌడ్, తండు సైదులు, గడ్డం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పౌరుడికి రాజ్యాంగ గ్రంధాన్ని పంపిణీ చేయాలి

- డీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యులు గిరి మహారాజ్

నవతెలంగాణ-మర్రిగూడ



భారత రాజ్యాంగ గ్రంధాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందజేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గిరి మహారాజ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడికి అందజేయాలని తెలియజేస్తూ పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాంగ గ్రంధాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందజేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రతి పౌరుడు తప్పనిసరిగా రాజ్యాంగ విలువలను తెలుసుకొని చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల నాయకులు వినోద్ మహరాజ్ రాజ్, జగన్, సాయి, కొండల్ గౌడ్, వినయ్, గిరి, గణేష్, శివ, రాజ్, నవీన్, చరణ్, శ్రవణ్, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రీ బిడ్ సమావేశం

- జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్గొండ జిల్లా నార్కట్ పల్లి మండలం ఎల్లా రెడ్డి గూడ గ్రామంలో రాజీవ్ స్వగృహ శ్రీ వల్లి టౌన్ షిప్ ఓపెన్ ప్లాట్లు, పాక్షిక నిర్మాణ గృహాలకు జూన్ 5 వ తేదీ నుండి 10 వ తేదీ వరకు ఐదవ విడత భౌతిక వేలం పై అవగాహన కలిగించేందుకు నేడు ప్రీ బిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ టీ.వినయ్‌కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం నియమ నిబంధనలు,ప్రక్రియ పై అవగాహన కలిగించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉదయాదిత్య భవన్‌లో ఉదయం 11 గంటలకు ప్రీ బిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.వేలం ప్రక్రియ నియమ నిబంధనలు అవగాహనకు ప్రజలు,ఔత్సా హికు లు ప్రీ బిడ్ సమావేశంకు హాజరు కావాలని కోరారు.



## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-చందంపేట

నకిలీ విత్తనాలు రైతులకు అంటగంటి మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చందంపేటగ వ్యవసాయ అధికారి మల్లారెడ్డి తెలిపారు. బుధవారం పోలేపల్లి సమీపంలో ఫెర్టిలైజర్స్ దుకాణాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. స్టాక్ ఎప్పుడు వస్తుందో తెలియజేయకుండా ఇస్తానుసారంగా ఫెర్టిలైజర్స్ డీలర్స్ గ్రామాలకు తరలిస్తే వారిపై లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రైతులు విత్తనాలు కొనేటప్పుడు ప్యాకెట్‌తో పాటు రసీదు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



## ఆర్థిక సాయం

నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన ఏనుగు బాల్‌రెడ్డి దశదిన కర్మలో అంతటి పారిజాత నరసింహలు బుధవారం పాల్గొని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు కాటం సత్తయ్య, సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ, సింగల్ విండో డైరెక్టర్ ఏనుగు రఘుమారెడ్డి, ఆంజనేయ స్వామి దేవాలయం మాజీ చైర్మెన్ గోలి గణేష్, వార్డు సభ్యులు ఏనుగు పద్మారెడ్డి, అంతటి శోభరాజు, పాలసంగం డైరెక్టర్‌లు కర్ధురి మల్లారెడ్డి, మారగొని యాదయ్య, ఏనుగు సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.